క్లుప్తంగా

అర్హులకు రుణమాఫీ చేయాలి

దోమ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని బొంపల్లి మాజీ ఉపసర్పంచ్ రఫీక్‌పాష సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రుణమాఫీకి అర్హులైన రైతులు 47 లక్షల మంది ఉంటే.. కేవలం ప్రభుత్వం 22 లక్షల మందికే మాఫీ చేసి చేతులు దులుపుకొందని ఆరోపించారు. రైతు భరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులు సైతం వేయలేని అసమర్థ ప్రభుత్వంలో మనం కొనసాగుతున్నామని మండిపడ్డారు. అనేక మంది అర్హులైన రైతులను ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన రైతులను గుర్తించి రుణమాఫీని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

త్వరలో విధుల్లోకి 'ఇన్‌స్ట్రక్టర్లు'

53 పోస్టులకు ఎంపిక పూర్తి

బొంరాస్‌పేట: విద్యాబోధనకు తాత్కాలికంగా నియమిస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధుల్లోకి రానున్నారు. 53 పోస్టుల నియామకానికి కొడంగల్‌లోని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సమక్షంలో దరఖాస్తుల పరిశీలన చేశారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట 11, దుద్యాలలో 11ఇన్‌స్ట్రక్టర్లకు 120 దరఖాస్తులు, కొడంగల్‌లో 11కు 108, దౌల్తాబాద్ మండలంలో 21కి 96 దరఖాస్తులు వచ్చాయి. 20న (మంగళవారం) నియామకం చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

పరిగి వ్యవసాయ అధికారిగా రజిత

పరిగి: మండల వ్యవసాయ అధికారిగా రజిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తాండూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న రజిత బదిలీపై పరిగికి వచ్చారు. పరిగిలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రెడ్డి రైతు శిక్షణకేంద్రం రాజేంద్రనగర్‌కు బదిలీ అయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

ధారూరు: మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కపిలేశ్వరస్వామికి భక్తులు మూడవ శ్రావణ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారి చెన్నబసవయ్యస్వామి శివలింగాన్ని పాలతో అభిషేకించి, నీటితో శుద్ధి చేసి, రుద్రాభిషేకం చేశారు. అనంతరం శివలింగాన్ని అలంకరించి హారతి ఇచ్చి, తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

బంగారు మైసమ్మకు బోనాలు



బోనాల ఊరేగింపు

కుల్కచర్ల: మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటల బాగా పండి సంతోషంగా ఉండాలని మొక్కుని, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అశోక్ కుమార్, చౌడాపూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



నీటి సరఫరా చేస్తున్న ట్రాక్టర్

దుద్యాల్ : గత మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం దగ్గరలోని పొలాలు, ఇతర వ్యక్తుల బోర్ల వద్దకు వెళ్లి అవసరాలకు సరిపడా నీటిని తీసుకెళ్తున్నారు. అందులో భాగంగా మండలంలోని హస్నాబాద్ గ్రామ పంచాయతీ అధికారులు ట్రాక్టర్ సాయంతో సోమవారం నీటి సరఫరా చేశారు.

భక్తిభావంతో ప్రశాంతత

మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకుంటేనే మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందూటి నరేందర్, మహేశ్వరి దంపతులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు శ్రావణ మాసం ఎంతో పవిత్రమైందన్నారు.



తాండూరు: కౌన్సిలర్ సాజిద్ అలీకి రాఖీ కడుతున్న మాజీ చైర్‌పర్సన్ కొత్రికె విజయలక్ష్మి



మర్పల్లిలో తమ్మునికి రాఖీ కడుతున్న అక్క



బషీరాబాద్ : హాస్టల్‌లో ఉన్న సోదరులకు రాఖీలు కట్టుతున్న సోదరీమణులు

అనుబంధాల రాఖీ

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అన్నదమ్ముళ్లకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టి బహుమతులు అందుకున్నారు. నాకు నువ్వు రక్ష.. నీకు నేను రక్ష మనమిద్దరం దేశానికి రక్ష అంటు అన్నాచెల్లెళ్లు రాఖీ పండుగను వేడుకగా నిర్వహించుకున్నారు. –సాక్షి, నెట్‌వర్క్



యాలాల: ఎస్‌ఐ శంకర్‌కు రాఖీ కడుతున్న కేజీబీవీ విద్యార్థిని



బంట్వారం: కోట్‌పల్లిలో..



యాలాల: తమ్ముడికి రాఖీ కడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి



ధారూరు: మైలారంలో..



కుల్కచర్ల: ఇప్పాయిపల్లి గ్రామంలో..



వికారాబాద్‌లో..



దౌల్తాబాద్: అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



పరిగి: తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్క

ప్రతి రైతుకు పంట రుణం

చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్: మండలంలోని తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) నుంచి ప్రతి రైతుకు పంట రుణం అందజేస్తామని సహకార సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం 54 మంది రైతులకు రూ.43 లక్షల చెక్కులను అందచేశారు. 392 మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ రూ.రెండు కోట్ల 85లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సంఘం అందరి సహకారంతో అభివృద్ధి బాటలో కొనసాగుతుందన్నారు. గతంలో 135 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.2కోట్ల 70లక్షలు అందించామని, వారు సకాలంలో చెల్లించడంతో, మళ్లీ మరో రూ.కోటి దీర్ఘకాలిక రుణాలు అర్హులైన రైతులకు అందచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. సంఘంలో



రైతులకు చెక్కులు అందచేస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

మొత్తం 2260 మంది రైతులు ఉండగా 886 మంది రైతులకు సంఘం పంట రుణం రూ.7కోట్ల 80లక్షల ఇచ్చామని తెలిపారు. రుణమాఫీ అయినా రైతులు వడ్డీ చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని సీఈఓ రాజమౌళి తెలియచేశారు. కార్యక్రమంలో మేనేజర్, సిబ్బంది వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

కుల్కచర్ల: రుణమాఫీ రైతుల పాలిట వరంలాంటిదని బొంరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లమల మొగులయ్య అన్నారు. సోమవారం మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చినమాట ప్రకారం రుణమాఫీ చేసి రైతుల పక్షపాతి అని మరొకమారు నిరూపించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు బుగ్గయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, దస్తయ్య, నర్సింహరెడ్డి, రవి, నరేష్, కేశవులు, బాలయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, మొగులయ్య, బచ్చయ్య, హన్మంతు, నర్సింలు, రమేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

గౌడ కులస్తుల హక్కుల సాధనకు కృషి

బీజేపీ గీతా సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్

బంట్వారం: గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బీజేపీ గీతా సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్ అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండలానికి సంబంధించిన గీతా సెల్ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా నియామకమైన కమిటీలు గౌడ కులస్తులకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో నియోజకవర్గ, మండలస్థాయి కమిటీల నియామకం చేపడుతామన్నారు. పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు తాను జిల్లా వ్యాప్తంగా పర్యటించి గీతా



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశంగౌడ్

సెల్ కమిటీలు వేస్తానన్నారు. కోట్‌పల్లి గీతా సెల్ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్‌కు నియమించి, పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణాయాదవ్, నాయకులు చెంద్రయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అనంతగిరి: మతోన్మాదుల చెర నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయిన అట్టడుగు వర్గాల ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ప్రపంచ ఆకలి సూచికలో 11వ స్థానానికి చేరిందన్నారు. నిరుద్యోగం దేశంలో దిన దినం పెరుగుతున్న ఈ ప్రభుత్వాలకు ఉపాధి అవకాశాలే కల్పించడం లేదని వాపోయారు. నిత్యావసర ధరలు సామన్యులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. సామాజికంగా కుల వివక్ష అంటరానితం నేటికి పలు చోట్ల కొనసాగుతుందన్నారు. దళితులపై దాడులు పెరుగుతున్నాయని వెంటనే ఆపాలని అన్నారు. ఉద్యమాలతోనే సాధించవచ్చని ప్రజా ఉద్యమాలకు ప్రజలంతా సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్కయ్య, మైపాల్, సుదర్శన్, లాలు, నవీన్, నర్సింలు పాల్గొన్నారు.

ప్రజావాణి వెలవెల



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. సోమవారం రాఖీ పండుగ కావడంతో ప్రజలెవ్వరూ ప్రజావాణికి రాలేదు. కార్యక్రమంలో ఎంపీఓ సుశీల్‌కుమార్, పశుసంవర్ధక శాఖ డాక్టర్ నరేంద్రనాత్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శఫియోద్దిన్, సీసీ అశోక్ తదితరులు ఉన్నారు.

వీరభద్రుడిగా శివుడు



తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయంలో శివుడు వీరభద్రేశ్వర స్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విజయ్‌కుమార్ శ్రావణమాసం మూడవ సోమవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రఫర్లు

దౌల్తాబాద్: మండలంలో సోమవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫర్లు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. వెయ్యి మాటలు చెప్పలేని అర్థాన్ని ఒక్క చిత్రంతో చెప్పవచ్చన్నారు. అలాంటి మధురమైనా జ్ఞాపకాలను, తీపిగుర్తులను ఫొటోల్లో బంధించి తీరిక దొరకినప్పుడు చూస్తూ గతాన్ని గుర్తు చేసుకుంటే కలిగే ఆనందాన్ని మాటల్లో వర్ణించలేమన్నారు.

ఫైన్ ఆర్ట్స్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహా

చేవెళ్ల: బీసీ గురుకుల కళాశాలలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి.నర్సింహ తెలిపారు. ఈ కళాశాలలో బీఏ యానిమేషన్ వీఎఫ్ఎక్స్ కోర్సు కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9032644463, 9063242329 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా అఖండజ్యోతి ఊరేగింపు



అఖండ జ్యోతితో ఊరేగింపుగా వస్తున్న యోగా గురువు, గ్రామస్తులు

దుద్యాల్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని మహంతేశ స్వామీ మఠంలో మహర్షి యోగానందస్వామి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ఘనంగా అఖండ జ్యోతి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా మహర్షి యోగానంద స్వామి మాట్లాడుతూ.. మానవుడు కుటుంబాలు సార్థక సాఫల్యం పొందలేక, శుద్ద అశుద్యంగా తెలివిలేని కారణం చేత జీవన దుఃఖంలో జీవిస్తున్నాడని అన్నారు. మానవుల దుఃఖ నివారణ కోసం సాత్విక జీవనం కొనసాగించాలన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం యోగా, ధ్యానం చేయడం వల్ల శరీరం దృఢంగా, ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరికి భక్తి భావన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వచనం తీసుకున్నారు.



విశేష అలంకరణలో మహర్షి స్వామివారు

ఘనంగా మహర్షి జన్మదిన వేడుకలు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం శ్రీవిఖానస మహర్షి జన్మదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శ్రీవిఖానస మహర్షి ఉత్సవ మూర్తిని తిరుచ్చిపై వేంచేపు చేసి పూలమాలలతో అలంకరించి ఉత్సవం నిర్వహించారు. అనంతరం అర్చనలు, పూజలు నిర్వహించారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు



రైతులకు సూచనలు చేస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: అర్హులైన రైతులు రుణమాఫీలో తమ పేర్లు రాలేదని ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేసి రైతాంగ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కొన్ని టెక్నికల్ కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. ప్రత్యేక పరిశీలన చేసి అర్హులకు మేలు జరిగేలా చూస్తామన్నారు. రుణమాఫీలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యజ్ఞోపవీత ధారణ



యజ్ఞోపవీత ధారణ చేస్తున్న బ్రాహ్మణులు

తాండూరు: బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో సోమవారం యజ్ఞోపవీత ధారణ (శ్రావణి)కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాఖీ పండగను పురస్కరించుకొని బ్రాహ్మణులు భుజానికి ఉన్న యజ్ఞోపవీతాన్ని విసర్జించి, గాయత్రి మంత్రం పఠనం చేస్తూ కొత్త యజ్ఞోపవీత ధారణ ధరిస్తారు. పట్టణంలోని పండురంగ స్వామి దేవాలయంలో బ్రాహ్మణులు పూజలు చేసి, యజ్ఞోపవిత ధారణ చేశారు. అలాగే, ఉత్తరాధిమఠంలో కూడా యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం చేశారు. ఉత్తరాధి మఠం పీఠాధిపతులు సత్యాత్మతీర్థస్వామి ఆదేశానుసారం యాజుర్వేద సంప్రదాయం ప్రకారం శ్రావణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం అర్చక నిర్వాహకులు సుధీంద్రచార్యులు, పురంధర చార్యుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యులు ఉండరు.. చికిత్స అందదు..

దోమ: ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వెళ్లిన తమ పట్ల ఆస్పత్రి సిబ్బంది దురుసుగా వ్యవహరించడంతో పాటు చికిత్స కూడా చేయలేదని పలువురు యువకులు ఆరోపించారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాలేపల్లి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి కాలుకు గాయమయ్యింది. వెంటనే తొటి స్నేహితులు దోమ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ ఉన్న వైద్య సిబ్బంది పట్టించుకోకపోగా.. వారిపై దురుసుగా వ్యవహరించారు. దీంతో స్నేహితులతోనే ఫస్ట్‌ఎయిడ్ చేసుకొని వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది. వైద్య సిబ్బందిపై ఆయా గ్రామాల ప్రజలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పేరుకే ఆస్పత్రి ఉంది.. వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. ఆస్పత్రికి వస్తున్న పేషెంట్లతో సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడడంతో రోగులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.




గాయపడిన స్నేహితుడికి ప్రాథమిక చికిత్స చేస్తున్న స్నేహితులు

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్
- ఎస్సీ వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి
- 21న భారత్ బంద్ విజయవంతం చేయాలని పిలుపు

షాద్‌నగర్: సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన తీర్పును న్యాయస్థానం పునఃసమీక్షించాలని ఆయన కోరారు. భీమ్‌సేన ట్రైబల్ ఆర్మీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న దేశ వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని మహేశ్ మాల పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఈ తీర్పు రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని బలహీన పరిచి రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా, సామాజికంగా అణిచివేసే కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. దీనిని ప్రతీ ఒక్కరు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వినోద్, శేఖర్, కేశవులు, మూర్తి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమ్‌సేన ట్రైబల్ ఆర్మీ